సాక్షి
అనకాపల్లి

సోమవారం । 10 । జూలై । 2023



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

విశాఖ: ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు.



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఏయూ యోగా విభాగంలో రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వక్తలు చెప్పారు.




తీరంలో విజిబుల్ పోలీసింగ్

విశాఖ: పర్యాటకుల సంరక్షణ నేపథ్యంలో రద్దీగా ఉండే ఆర్కేబీచ్, రుషికొండ బీచ్ వద్ద పర్యాటకులను అలెర్ట్ చేశారు.

న్యూస్‌రీల్

రేపు మధ్యాహ్నం 2.30 గంటల వరకే అప్పన్న దర్శనాలు



సింహాచలం: సింహగిరి గ్రామదేవతలు ఉమామహేశ్వరి పాదాలమ్మ, బంగారమ్మ పండగ మంగళవారం నిర్వహించనున్న నేపథ్యంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు ఆరోజు మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే లభిస్తాయని దేవస్థానం ఏఈవో భ్రమరాంబ తెలిపారు. 12వ తేదీ ఉదయం 7 గంటల నుంచి దర్శనాలు యథావిధిగా లభిస్తాయని పేర్కొన్నారు. సోమవారం రాత్రి 9 గంటలకు తొలేళ్ల ఉత్సవం, మంగళవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు అనుపోత్సవాలు జరుగుతాయన్నారు.

రోడ్డు విస్తరణ పనుల ప్రారంభం నేడు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులను సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తున్నట్లు జీవీఎంసీ జోనల్ కమిషనర్ వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక భవన యజమానుల సహకారం, కోర్టు ఆదేశాల మేరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.

నేడు డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ మేయర్ కార్యక్రమం జరగనుంది. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో 1800 4250 0009 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి నేరుగా మేయర్‌కు సమస్యలు తెలపవచ్చు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ హాలులో జగనన్నకు చెబుదాం(స్పందన)కార్యక్రమం ఉంటుంది. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మతో కలిసి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

ఒడియా భాషలోకి 'సింహాచలం క్షేత్ర మహాత్యం'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో త్రినాథరావు, లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్

సింహాచలం: ఒడియా భాషలో రచించిన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్ర మహాత్యం పుస్తకావిష్కరణ ఆదివారం సింహగిరిపై ఘనంగా జరిగింది. సింహాచలానికి చెందిన పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితుడు టి.పి.శ్రీరామచంద్రాచార్యులు తెలుగులో రచించిన సింహాచలం క్షేత్ర మహాత్యం పుస్తకాన్ని ఒడియా భాషలోకి భక్తుడు సాయికుమార్ తర్జుమా చేశారు. ఆ పుస్తకాలను స్వామివారి ఆలయంలో దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవోలు వి.బి.వి.రమణమూర్తి, భ్రమరాంబ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన వర్సిటీ అధికారులు



మొక్కను నాటుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో వర్సిటీ అధికారులు మొక్కలు నాటారు. ఆదివారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి స్వయంగా పాల్గొని కంప్యూటర్ సైన్స్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగం వెనుక భాగంలో నూతనంగా అభివృద్ధి చేసిన రహదారికి ఇరువైపులా వేప, కదంబం, నాగలింగం, పొన్న, పొగడ, వెలగ, గంగావలి, రేల, జకరందం, రావి, మర్రి, అడవి జువ్వి తదితర జాతులకు చెందిన మొక్కలను నాటారు. త్వరలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, డీన్ ఆచార్య జి.వీర్రాజు, శ్రీధర్, డాక్టర్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్య 'తాండవ'ం

వ్యవసాయాన్ని పండగలా మార్చాలన్నది సీఎం జగన్ ప్రభుత్వ సంకల్పం. అందుకే ఆయకట్టు చివరి భూమికి కూడా నీరందించాలని పరితపిస్తోంది. అవసరమైన ప్రతి ప్రాజెక్టు మరమ్మతులు, పూడిక తీతకు పుష్కలంగా నిధులందిస్తోంది. అయితే అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారుతోంది. ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తోంది. ఇందుకు ఉదాహరణే తాండవ జలాశయం. దీని మరమ్మతులకు ఏప్రిల్లోనే రూ.6.64 కోట్లు మంజూరైనా.. అధికారుల్లో చలనం లేక నిధులు మూలుగుతున్నాయి.



తాండవ కుడి కాలువలో పేరుకుపోయిన పూడిక



ఆయకట్టుకు నీరు ప్రవహించలేని విధంగా ఎడమ కాలువ దుస్థితి

- నిధులొచ్చి నెలలు గడుస్తున్నా.. పనులు చేపట్టని వైనం
- ఈ ఏడాది శివారు ఆయకట్టుకు సాగు నీరందేనా?
- తాండవ జలాశయ అధికారులపై రైతుల ఆగ్రహం

నాతవరం: ఉమ్మడి జిల్లాలో ఏకైక మేజర్ ప్రాజక్టు తాండవ రిజర్వాయరు. ఖరీఫ్ సీజన్‌లో 52 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ జలాశయం నుంచి నీరందించాలని ప్రభుత్వ సంకల్పం. ఇందుకు ఏప్రిల్ 18న రూ.6.64 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో అనకాపల్లి, కాకినాడ జిల్లాల పరిధిలో నర్సీపట్నం, పాయకరావుపేట, తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో ఉన్న కాలువలను అభివృద్ధి చేయాలి. నిధులు కేటాయించి మూడు మాసాలవుతున్నా.. పనులు చేపట్టకపోవడంతో ఈ ఏడాది ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించడం ప్రశ్నార్థకంగా మారింది.

120 కి.మీ. పొడవునా నిర్లక్ష్యం

తాండవ రిజర్వాయరు నుంచి ఆయకట్టుకు నీరిచ్చేందుకు 120 కిలో మీటర్ల పొడవున కాలువలు ఏర్పాటు చేశారు. ఏటా ఖరీఫ్ సీజన్‌కు నీరు విడుదల చేసే ముందే కాలువలో పూడిక తొలగింపు, శిథిలమైన గట్లు, గేట్ల మరమ్మతులు చేస్తుండేవారు. ఈ ఏడాది నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా అధికారులు ఎలాంటి పనులు చేపట్టలేదు. ఇరిగేషన్ అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా నిధులు అందుబాటులో ఉన్నా.. పనులు చేయలేదని రైతులు బాహాటంగానే ఆక్షేపిస్తున్నారు. గతంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే డీఈ అధ్వర్యంలో తాండవ ప్రాజెక్టు పరిధి ప్రధాన కాలువలతో పాటు పిల్ల కాలువలూ అభివృద్ధి చేసేవారు. ఈ ఏడాది మాత్రం ఏ పనులూ చేపట్టలేదు.

గతానికి భిన్నంగా..

ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఏటా క్షేత్రస్థాయిలో పనులను చిన్నచిన్నగా విభజించేవారు. ఒక్కో పని రూ.10 లక్షలకు అటూఇటుగా చూసుకుని, సుమారు 65 నుంచి 70 పనుల పేరిట ప్రతిపాదనలు రూపొందించేవారు. అనుమతులు త్వరితగతిన వచ్చేవి. ఈసారి అధికారులు ఇందుకు భిన్నంగా వెళ్లారు. ఒక్కో పని రూ.40 లక్షలు ఉండేలా ప్రతిపాదనలు రూపొందించారు. వీటికి శాంక్షన్ ఆర్డర్ కోసం ఇరిగేషన్ సీఈకి పంపించారు. ఈ పనులకు ఆమోదం రప్పించుకోవడంలో సమన్వయం కొరవడి, రైతులకు శాపంగా మారింది. చిన్నచిన్నగా ఎక్కువ పనులకు ప్రతిపాదిస్తే పర్యవేక్షణ భారం అధికమవుతుందన్న కారణంగానే సిబ్బంది ఇలా చేశారన్న ఆరోపణలున్నాయి.



ప్రధాన గేట్ల ద్వారా వృథాగా పోతున్న నీరు

కానరాని అధికారులు

గతంలో ఇక్కడ పని చేసిన డీఈ రాజేంద్రకుమార్, జేఈ రవికుమార్ బదీలీ అయ్యారు. నర్సీపట్నం ఇరిగేషన్ డీఈ స్వామినాయుడుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన తాండవ ప్రాజక్టుకు వచ్చిన దాఖలాల్లేవు. ఇటీవల కాలంలో తాండవ ప్రాజెక్టుపై పూర్తిగా అధికారుల పర్యవేక్షణ కొరవడింది. తాండవ ప్రధాన గేట్ల లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసింది. అయినా గేట్ల మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ప్రాజెక్టులో నీరంతా వృథాగా పోతోంది. అధికారులు నిర్లక్ష్యంతో తమ కళ్ల ముందే సాగు నీరు వృథా అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

తాండవ ప్రాజక్టు అధికారుల తీరుపై ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశాలల్లో ఎంపీపీలు, ఇతర సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. వచ్చే నెలలో ఆయకట్టుకు నీరు విడుదల చేస్తారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలో పూడిక తొలగించి, శిథిలమైన గట్లు, గేట్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

అధికారులు కావాలనే చేశారు



ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలనే అధికారులు ఇలా చేస్తున్నారు. ప్రభుత్వం నిధులిచ్చి నెలలు గడుస్తున్నా పూడికతీతలు, గేట్ల మరమ్మతులు చేయకుండా వదిలేశారు. అధికారుల కాలాయాపనపై ఉన్నతాధికారులు దృష్టి సారించకపోతే సమస్య తీవ్రస్థాయికి వెళ్తుంది.

– షేక్ రజాక్, ఆయకట్టు రైతు, తాండవ గ్రామం

క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు



తాండవ ప్రాజెక్టు పరిధిలో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తాను. ఏటా సకాలంలో కాలువలో పూడికతీత, మరమ్మతులు వంటి పనులు జరిగేవి. ఈ ఏడాది ఎందుకు చేపట్టలేదో తెలుసుకుంటా. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటా.

– కె.సూర్యకుమార్, ఇరిగేషన్ ఎస్ఈ, ఉమ్మడి జిల్లా

పలు రైళ్ల రద్దు



తాటిచెట్లపాలెం (విశాఖ): దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న భద్రతాపరమైన పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. గుంటూరు-విశాఖపట్నం (17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు, విశాఖపట్నం-గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు, కాకినాడ-విశాఖపట్నం-కాకినాడ (17267/17268) ఎక్స్‌ప్రెస్ ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు ఇరువైపులా, రాజమండ్రి-విశాఖపట్నం-రాజమండి(07466/07467) పాసింజర్ స్పెషల్ ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు ఇరువైపులా రద్దు చేశారు.

పలు రైళ్లు దారి మళ్లింపు : పలు రైళ్లు ఆయా తేదీల్లో రెగ్యులర్ మార్గం నిడదవోలు-ఏలూరు-విజయవాడ మీదుగా కాకుండా వయా నిడదవోలు-భీమవరంటౌన్- గుడివాడ-విజయవాడ మీదుగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. ధన్‌బాద్-అలెప్పీ(13351) బొకారో ఎక్స్‌ప్రెస్ ఈనెల 11,14,15 తేదీల్లో, టాటానగర్ - ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్ ఈనెల 14వ తేదీన, హతియా- ఎస్ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్ ఈనెల 15 తేదీన, హతియా- ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్ ఈనెల 11న మళ్లించబడిన మార్గంలో నడుస్తాయి.

పలు రైళ్లు రీషెడ్యూల్ : ఆయా స్టేషన్‌ల్లో ఆదివారం పలు రైళ్లు ఆలస్యంగా బయల్దేరాయి. ఆయా స్టేషన్‌లకు చేరుకోవలసిన పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా చేరుకోవడంతో ఈ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. చెన్నై సెంట్రల్ - షాలిమార్ (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా ఉదయం 9 గంటలకు, ఎస్ఎంవీ బెంగళూరు-జసిద్ది (22305) ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 12 గంటలకు, హౌరా-సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా ఉదయం 11.30 గంటలకు, సికింద్రాబాద్ - హౌరా (12704)సుమారు 4 గంటలు ఆలస్యంగా రాత్రి 7.55 గంటలకు బయల్దేరాయి.

మరో చరిత్రకు నాంది

- విశాఖ-భోగాపురం మధ్య గొప్ప పట్టణం ఆవిర్భావం
- విశాఖ కలెక్టర్ మల్లికార్జున వెల్లడి
- ఒబెరాయ్ హోటల్ నిర్మాణ పనులకు భూమిపూజ

తగరపువలస: రానున్న 10–15 ఏళ్లలో విశాఖ–భోగాపురం మధ్య గొప్ప పట్టణం రూపుదిద్దుకుంటుందని విశాఖ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున అన్నారు. ఇటీవల విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కుదిరిన ఒప్పందం ప్రకారం ఆదివారం భీమిలి మండలం అన్నవరం తీరంలో ఒబెరాయ్ హోటల్ గ్రూప్ ఏడు నక్షత్రాల సదుపాయాలతో నిర్మిస్తున్న లగ్జరీ రిసార్ట్స్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో కడప జిల్లా గండికోట నుంచి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వర్చువల్ విధానంలో సీఎంతో మాట్లాడుతూ మే 3వ తేదీన ఇక్కడకు 8 కిలోమీటర్ల దూరంలోని భోగాపురంలో రూ.4,592 కోట్లతో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఉత్తరాంధ్ర ప్రజల కల నెరవేర్చారన్నారు. అదే రోజు మధురవాడలో రూ.21,844 కోట్లలో సుమారు 50 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించే 300 మెగావాట్ల ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పుడు రూ.350 కోట్లతో 40 ఎకరాలలో ఏడు నక్షత్రాల సదుపాయాలతో 300 విల్లాస్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నారన్నారు. దీని ద్వారా 5,500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. 65 రోజుల వ్యవధిలో ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా రూ.26 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఇందుకు జిల్లా ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియచేస్తున్నామన్నారు. ఇక్కడకు 150 మీటర్ల దూరంలో రానున్న బీచ్ కారిడార్ వల్ల మరిన్ని పరిశ్రమలు వచ్చి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దీనంతటికి మీ ముందు చూపే కారణమని కొనియాడారు.

పర్యాటక రంగాన్ని విస్మరించిన చంద్రబాబు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ హయాంలో చంద్రబాబు ఉత్తరాంధ్రను, పర్యాటక రంగాన్ని విస్మరించారన్నారు. ఇక్కడి వారిని ఆయన ఓటు బ్యాంకుగా మాత్రమే చేసుకోగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు నెలల వ్యవధిలో ప్రతిష్టాత్మక మూడు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రజల మనసును గెలుచుకున్నారన్నారు. హైదరాబాద్-శంషాబాద్ వలే విశాఖ-భోగాపురం మధ్య పట్టణీకరణతో పాటు ఇండస్ట్రియల్ టూరిజం, అనుబంధ పెట్టుబడుల ద్వారా అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ సీఎం జగన్ ఉత్తరాంధ్రలో అదానీ, అంబానీ వంటి వారితో సమర్థవంతమైన నాయకత్వంతో స్థిరమైన పెట్టుబడులు పెట్టిస్తున్నారన్నారు. ఇందులో 10 శాతం కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉత్తరాంధ్రకు చేయలేదన్నారు. ఈ సందర్భంగా అన్నవరంలో నిర్మించనున్న లగ్జరీ రిసార్ట్స్‌కు కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం యూత్ కో ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివ సందీప్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకుడు ఫణి శ్రీనివాస్ పాల్గొన్నారు.



భూమిపూజలో విశాఖ కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి, ఎమ్మెల్సీ కల్యాణి తదితరులు

అమ్మో..రూ.500 ?

- ఆ నోటు చూస్తేనే భయపడుతున్న జనం
- జోరుగా నకిలీల చలామణీ
- నక్కపల్లి పోలీసు పెట్రోల్ బంకులో మస్కా



నకిలీ ఐదువందల రూపాయల నోట్లు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి పరిసర గ్రామాల ప్రజలు ఇప్పుడు రూ.500 నోటు అంటేనే హడలిపోతున్నారు. కొద్ది రోజులుగా పరిసర ప్రాంతాల్లో దొంగనోట్ల చలామణీ జోరుగా సాగుతోంది. పెట్రోల్ బంకులను కేంద్రంగా చేసుకుని ముఠా సభ్యులు రూ.500 నకిలీ నోట్లను మారుస్తున్నారు. మరికొందరు పశువుల మార్కెట్లలో మేకలు,గొర్రెలు, పశువులను కొనుగోలు చేసినప్పుడు దొంగనోట్లు ఇస్తున్నారు. తాజాగా ఆదివారం నక్కపల్లిలో పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న పోలీసు వెల్ఫేర్ పెట్రోల్‌బంకులో సుమారు 8 నకిలీ రూ.500 కరెన్సీ నోట్లతో గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్/డీజిల్ కొనుగోలు చేశారు. ఇక్కడ పెట్రోల్‌పంపుల వద్ద పనిచేస్తున్న సిబ్బందికి నకిలీ నోట్లను గుర్తు పట్టే సామర్థ్యం లేకపోవడం, అవసరమైన తనిఖీ యంత్రాలను ఏర్పాటు చేయకపోవడంతో మోసపోతున్నారు. పెట్రోల్‌బంకుల్లో పనిచేస్తున్న సిబ్బంది క్యాష్ కౌంటర్ వద్దకు వెళ్లి నగదు అప్పగించేటప్పుడు నకిలీ నోట్లు బయటపడడంతో బిక్కముఖం వేస్తున్నారు. ఈ నష్టం మీరే భరించాలని బంకు యాజమాన్యం చెబుతుండడంతో తాము నష్టపోతున్నామని వాపోతున్నారు. నక్కపల్లి పోలీసు పెట్రోల్‌బంకులో ఒక యువకుడికి ఏకంగా రూ.500 నోట్లు 6, మరొకరికి 2 నకిలీ నోట్లు వచ్చాయి. మండలంలో చినదొడ్డిగల్లు, వేంపాడు, దేవవరం పెట్రోల్‌బంకుల్లో కూడా ఒక ముఠా గుట్టుచప్పుడు గాకుండా దొంగ నోట్లు చలామణీ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ప్రతీ శుక్రవారం, బుధవారాల్లో నక్కపల్లిలో జరిగే వారపుసంతలు,పశువుల మార్కెట్లలో లావాదేవీలు జరిగినప్పుడు అసలైన రూ.500 నోట్ల మధ్య నకిలీ నోట్లను పెట్టి అమాయకులైన వారికి ఇచ్చి మోసగిస్తున్నారు.బ్యాంకుకు వెళ్లినప్పుడు కట్టలో నకిలీ నోట్లు ఉన్నాయని తెలుసుకున్న పశువుల వ్యాపారులు లబోదిబోమంటున్నారు.



నక్కపల్లి పోలీస్ పెట్రోలు బంకులో సిబ్బందికి అందిన నకిలీ ఐదువందల నోట్లు

కార్పొరేట్‌కు దీటుగా కేజీహెచ్ అభివృద్ధి

- రూ.2.50 కోట్లతో కొనసాగుతున్న పనులు
- నేటి నుంచి ఓపెన్ హార్ట్ సర్జరీలు ప్రారంభం
- ఆస్పత్రికి చేరుకున్న రూ.5 కోట్ల సి.టి.స్కాన్ మెషీన్
- ఎంఆర్ఐ స్కాన్ మెషీన్ కూడా మంజూరు
- త్వరలో కంప్యూటర్ ఆధారిత సేవలు
- కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్ వెల్లడి



మహారాణిపేట (విశాఖ): కార్పొరేట్‌కు దీటుగా కేజీహెచ్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. రూ.2.50 కోట్లతో పలు పనులు కొనసాగుతున్నాయని, సి.టి. స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ మెషీన్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. కేజీహెచ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.5 కోట్ల విలువైన సి.టి.స్కాన్ పరికరం కేజీహెచ్‌కు చేరుకుందని, గైనిక్ విభాగం ఎదురుగా ఈ పరికరాన్ని అమర్చుతున్నట్లు చెప్పారు. రూ.10 కోట్ల విలువైన ఎంఆర్ఐ స్కాన్ మిషన్ త్వరలోనే చేరుతుందని.. ఈ రెండు పరికరాలను రేడియాలజీ విభాగాధిపతి పర్యవేక్షిస్తారని వెల్లడించారు.

ఓ రోగికి నేడు ఓపెన్ హార్ట్ సర్జరీ

కేజీహెచ్‌లో ఏడాది మార్చి 24న మిషన్ మరమ్మతుకు గురికావడంతో ఓపెన్ హార్ట్ సర్జరీలు నిలిచిపోయాయని, రూ.50 లక్షల వ్యయంతో టెంపరేచర్ కంట్రోల్ మెషీన్ (టీసీఎం) అమర్చినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. శనివారం ట్రయల్ పూర్తయిందని, సోమవారం ఓ రోగికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్డియోథొరాసిక్ విభాగాధిపతి (హెచ్‌వోడీ) డాక్టర్ కె.మణిత ఆధ్వర్యంలో ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సిబ్బంది ఉన్నారని తెలిపారు. ఓపెన్ హార్ట్ సర్జరీల కోసం 10 కేసులు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.

రెండో క్యాజువాలిటీ నిర్మాణం

ప్రస్తుతం ఉన్న క్యాజువాలిటీ రోగులకు సరిపోకపోవడంతో.. మరో క్యాజువాలిటీ నిర్మాణానికి కలెక్టర్ అనుమతి ఇచ్చారని డాక్టర్ శివానంద్ తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ(హెచ్‌డీసీ) నుంచి రూ.30 లక్షలు మంజూరవడంతో.. సోమవారం నుంచి పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం 20 పడకలు ఉండగా, రెండో క్యాజువాలిటీ నిర్మాణంతో మరో 30 పడకలు అందుబాటులోకి వస్తాయన్నారు.

సాయంత్రం ఓపీపై విస్తృత ప్రచారం

కేజీహెచ్‌లో అన్ని ఓపీలు సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తున్నామని.. దీనిపై పూర్తిస్థాయిలో ప్రచారం చేస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. ఇందుకోసం ఆస్పత్రిలో సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం ఓపీలు యథావిధిగా కొనసాగుతున్నాయని.. సాయంత్రం ఓపీలను కూడా రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పిల్లల వార్డులో రెండు యూనిట్లు

పిల్లల వార్డులో రూ.70 లక్షల వ్యయంతో రెండు యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ శివానంద్ తెలిపారు. నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ), ప్రత్యేక నవజాత సంరక్షణ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ) నిర్మాణ పనులు చేపట్టామన్నారు. త్వరితగతిన ఈ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆస్పత్రిలో జనన, మరణ వివరాలను కంప్యూటర్‌లో ఫీడ్ చేస్తున్నామని.. దీని వల్ల అవసరమైన సర్టిఫికెట్లు జారీ సులువవుతుందన్నారు. స్టేట్ బ్యాంక్ ఇండియా సీఎస్సార్ కింద రూ.50 లక్షలు మంజూరు చేసిందని, దీనికి కలెక్టర్ అనుమతి ఇచ్చారన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

ఘనంగా స్వర్ణపుష్పార్చన

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 8 వరకు స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



స్వర్ణ పుష్పాలు

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని జరిపించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీతం ఘట్టం

ఐక్యతతోనే బీసీల సంక్షేమం

అనకాపల్లి టౌన్: దేశ జనాభాలో బీసీలు 52 శాతం మంది ఉన్నారని, అందరూ ఐక్యంగా ఉండాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు అన్నారు. స్థానిక విజయ రెసిడెన్సీలో ఆదివారం జరిగిన ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఆవిర్భావ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అధిక జనాభా గల బీసీలకు తగినంత ప్రాధాన్యం దక్కడం లేదని, కలిసికట్టుగా ఉన్నప్పుడే రాష్ట్రానికైనా, దేశానికైనా బీసీల బలం తెలుస్తుందని ఆయన తెలిపారు. కుల సంఘాలు చిన్నచిన్న సంఘాలుగా మారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు విల్లూరి పైడారావు మాట్లాడుతూ బీసీలందరూ రాజ్యాధికారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో రిజర్వేషన్లు కావాలని ఆయన కోరారు. అనంతరం నూతనంగా ఏర్పడిన ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ సభ్యులతో దాడి వీరభద్రరావు ప్రమాణ స్వీకారం చేయించారు.



సమావేశంలో మాట్లాడుతున్న దాడి వీరభద్రరావు

హక్కుల సాధనకు ఐక్య పోరాటం

బీసీలందరూ ఒకే తాటిపై రావాలని, న్యాయమైన హక్కులకు మద్దతు ప్రకటించిన పార్టీ పక్షాన నిలవాలని బీసీ అసోసియేషన్ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఆదారి కుమార్‌స్వామి అన్నారు. స్థానిక విజయ రెసిడెన్సీ హాల్లో 'రాష్ట్ర బీసీల ఐక్యత–రాజ్యాధికారం' అనే అంశంపై ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌పై పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టేందుకు జాతీయ అధ్యక్షుడు పోతల ప్రసాద్‌నాయుడు కృషి చేస్తున్నట్లు చెప్పారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాదం భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో బీసీలు ఎక్కువగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అడవుల్లో జంతువులకు జనగణన ఉంది కానీ, దేశంలో బీసీలకు జనగణన లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలోని పలు బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ అసోసియేషన్ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఆదారి కుమార్‌స్వామి

క్లుప్తంగా

108 గళాలతో ఆదిత్య హృదయ పారాయణం



ఆదిత్య హృదయ పారాయణ చేస్తున్న దృశ్యం

నక్కపల్లి: మండలంలోని వేంపాడులో ఆదివారం 108 గళాలతో ఆదిత్య హృదయ పారాయణ కార్యక్రమం ఘనంగా జరిగింది. సన్ స్పిరిట్యువల్ సొసైటీ వ్యవస్థాపకుడు విక్రమాదిత్య నేతృత్వంలో 108 గళాలతో ఆదిత్య హృదయం, మణి పద్మేహం, తదుపరి హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. ముందుగా ప్రత్యక్ష దైవం సూర్యనారాయణ మూర్తికి వేదపండితులు యాజ్ఞవల్క్యశర్మ, జగన్మోహన్ శర్మ ప్రత్యేక పూజలు, సూర్య నమస్కారాలు చేశారు. అనంతరం సౌరహోమం, పూర్ణాహుతి నిర్వహించారు.

రాష్ట్ర కార్యదర్శిగా రామకృష్ణ



నర్సీపట్నం: ఏపీ ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యదర్శిగా నర్సీపట్నం సాంఘిక సంక్షేమ శాఖలో పని చేస్తున్న తానారి రామకృష్ణ నియమితులయ్యారు. కార్యదర్శిగా అవకాశం కల్పించిన రాష్ట్ర నాయకత్వానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

వ్యాన్ బోల్తా



అదుపు తప్పి పొలాల్లో బోల్తాపడిన వ్యాన్

రావికమతం: మండల కేంద్రం రావికమతం నుంచి కింతలి వెళ్తున్న బొలేరో వ్యాన్ మత్స్యపురం ఎర్రిగెడ్డ సమీపంలో ఆదివారం బోల్తా పడింది. పొలాల్లోకి దూసుకుపోయి పల్టీలు కొట్టింది. డ్రైవర్ ఈశ్వరరావు చాకచక్యంగా ప్రమాదం నుంచి బయటపడ్డాడు. బ్రేక్ ఫెయిల్ కావడంతో వాహనం అదుపుతప్పినట్టు డ్రైవర్ తెలిపాడు.

జోరుగా వరి విత్తనాల పంపిణీ

- రాయితీపై ప్రభుత్వం సరఫరా
- సందడిగా రైతు భరోసా కేంద్రాలు
- సన్న రకాలపై రైతుల ఆసక్తి
- చోడవరం సబ్ డివిజన్‌లో 4,050 క్వింటాళ్ల విత్తనాలు
- 32,430 ఎకరాల్లో వరిసాగుకు సన్నాహాలు



లక్ష్మీపురం ఆర్బీకేలో రైతులకు విత్తనాలు అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



చోడవరంలో సైకిల్‌పై విత్తనాలు తీసుకెళ్తున్న రైతు

చోడవరం: ఖరీఫ్ వరి నారుకు విత్తనాలు జల్లే పనులు జోరందుకున్నాయి. రైతులకు కావలసిన వరి విత్తనాలను ప్రభుత్వం ముందుగానే పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా వీటిని రాయితీపై పంపిణీ చేయడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. గతంలో విత్తనాల కోసం ఎరువుల దుకాణాల దగ్గర పడిగాపులు పడి నానా ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రైతులకు గ్రామస్థాయిలోనే ఆర్బీకేల ద్వారా ఖరీఫ్ వరి విత్తనాలు సరఫరా చేస్తోంది. జిల్లాలో అత్యధిక వరి సాగు చేసే చోడవరం సబ్ డివిజన్ పరిధిలోని చోడవరం, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, చీడికాడ, కె.కోటపాడు మండలాల్లో 108 రైతు భరోసా కేంద్రాల ద్వారా 4050.7 క్వింటాళ్ల వరి విత్తనాలు రైతులకు అందిస్తున్నారు. ఈ డివిజన్ పరిధిలో వరి సాధారణ విస్తీర్ణం 32,430 ఎకరాలు కాగా, ఈ ఏడాది మరికొంత పెరిగే అవకాశముంది.

బీపీటీ సన్నరకాల విత్తనాలు సరఫరా..

గత ప్రభుత్వాలు బీపీటీ సన్నరకాల విత్తనాలు సరఫరా చేయకపోవడంతో ముతక రకాలపైనే రైతులు ఆధారపడి సాగు చేసే వారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఫుడ్‌కార్పొరేషన్ ద్వారా రేషన్‌లోనూ సన్న బియ్యాన్నే ఇవ్వాలని భావించిన ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా బీపీటీ రకాల విత్తనాలనే రైతులకు సరఫరా చేయడం ప్రారంభించింది. దీనితో ఈ ఏడాది సన్న బియ్యం రకాల విత్తనాలనే ఆర్బీకేల ద్వారా అందిస్తున్నారు. స్వర్ణ, సోనామసూరి, సాంబమసూరి, ఆర్జీఎల్, నెల్లూరు సన్నాలు, శ్రీ ధృతి, స్వర్ణ, రాజేంద్రనగర్ సన్నాలు రకాల విత్తనాలు సరఫరా చేశారు. 30 కేజీల వరి విత్తనం బ్యాగ్‌కు కేజీకి రూ. 10 చొప్పున రూ.300 వరకు సబ్సిడీని అందిస్తుంది. దీంతో విత్తనం ధర కాస్త అందుబాటులో ఉండటంతో రైతులు ముందుగానే వారికి కావలసిన రకాలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటున్నారు. దీనికితోడు విత్తనాలు తొలకరికి ముందే ఆర్బీకేలకు చేరడంతో రైతులకు అవసరమైనప్పుడు నేరుగా వెళ్లి తీసుకుంటున్నారు. వరి విత్తనాల పంపిణీలతో ఆర్బీకేలన్నీ సందడి ఉన్నాయి.

మండలం	ఆర్బీకేలు	విత్తనాలు (క్వింటాళ్లు)
చోడవరం	26	535.6
బుచ్చియ్యపేట	22	479.6
చీడికాడ	13	993.7
కె. కోటపాడు	22	913.6
దేవరాపల్లి	20	1128.2

రైతులకు ఇబ్బంది లేకుండా విత్తనాల సరఫరా

ఖరీఫ్‌లో రైతులు ఇబ్బంది పడకుండా ముందస్తుగానే ప్రభుత్వం వరి విత్తనాలు సరఫరా చేసింది. కావలసినంత అందుబాటులో ఉన్నాయి. అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో నారుమడులు సిద్ధం చేసుకోవాలి. ఆధునిక యంత్రాల సాయంతో నారుమడులు వేసుకుంటే నారు బాగా పెరుగుతుంది. రైతులు జాగ్రత్తలు పాటించాలి.

– రవీంద్రనాథ్, వ్యవసాయ సహాయక సంచాలకుడు, చోడవరం

పరువుపోయిందనే ఆత్మహత్య

డి.కొత్తూరు ఘటన వివరాలు వెల్లడించిన సీఐ సుధాకర్



వివరాలు వెల్లడిస్తున్న పాడేరు సీఐ సుధాకర్

పాడేరు రూరల్: మండలంలోని దేవాపురం పంచాయతీ డి.కొత్తూరులో తన పరువుపోయిందనే కారణంతోనే ఈనెల 7వ తేదీ రాత్రి కొండపల్లి కొండలరావు నాటు తుపాకీతో కాల్చుకుని మృతి చెందాడని పాడేరు సీఐ సుధాకర్ తెలిపారు. పాడేరులోని తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 7న డి. కొత్తూరు గ్రామానికి చెందిన కొండపల్లి లక్ష్మి, కొండపల్లి కొండలరావు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో కొండలరావు తనపై లైంగికదాడి చేయబోయాడని ఆరోపిస్తూ పంచాయతీ పెట్టేందుకు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి లక్ష్మి చెప్పిందన్నారు. అదేరోజు కొండలరావు తనవద్ద ఉన్న నాటుతుపాకీ పట్టికొని లక్ష్మి ఇంటికి వెళ్లాడని, తన పరువు ఎందుకు తీస్తున్నావని ఆమెతో పాటు ఆమె భర్త రామకృష్ణతో గొడవ పడ్డాడని తెలిపారు. అవమానం భరించలేకనే కొండలరావు నాటుతుపాకీతో మెడవద్ద కాల్చుకొని మృతి చెందాడని సీఐ తెలిపారు. అయితే లక్ష్మి, ఆమె భర్త రామకృష్ణ కాల్చి చంపి ఉంటారనే అనుమానంతో కొండలరావు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని చెప్పారు. నాటుతుపాకీల వినియోగం చట్టరీత్యా నేరమని, గిరిజనులు వేటకు ఉపయోగించే నాటుతుపాకులను స్వచ్ఛందంగా తమకు అప్పగించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐలు లక్ష్మణ్‌రావు, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

శాకంబరిగా మోదమ్మ



సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆదివారం శాకంబరి అలంకరణతో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి శాకంబరి అలంకరణ మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన విగ్రహాన్ని కూరగాయలు, ఆకుకూరలు, పలు పండ్ల జాతులతో అందంగా అలంకరించారు. ఆదివారం వేకువజామున ఆలయ అర్చకుడు సుబ్రమణ్యశాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

పడవ బోల్తా..

భీమునిపట్నం: భీమిలి తీరంలో ఆదివారం పడవ బోల్తాపడింది. బోయివీధికి చెందిన 8 మంది మత్స్యకారులు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. పడవ, ఇంజిన్ దెబ్బతిని రూ.లక్ష నష్టం వాటిల్లింది.

17 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

రూ.1,61,060 నగదు, 18 మొబైళ్లు స్వాధీనం

డాబాగార్డెన్స్: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న 17 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలివీ.. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి గ్రీన్‌పార్క్ హోటల్ సమీపంలోని శ్రీనివాస అపార్ట్‌మెంట్ రెండు, మూడు అంతస్తుల్లో పేకాట ఆడుతున్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది అపార్ట్‌మెంట్‌పై దాడి చేసి.. పేకాట ఆడుతున్న 17 మందిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,61,060 నగదుతో పాటు, 18 మొబైళ్లు, కార్డులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని టూటౌన్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ ఎత్తివేత



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఏసీపీ త్రినాథ్

బీచ్‌రోడ్డు: రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని విడిచిపెట్టాలని.. లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ హెచ్చరించారు. నగరంలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తి విడిచి సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ ఎత్తివేతకు కృషి చేస్తామన్నారు. మీపై ప్రత్యేక నిఘా ఉంటుందని, కౌన్సెలింగ్‌కు హాజరు కాకపోయినా, నేరాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను హెచ్చరించారు.

అమ్మా.. నూకాంబిక చల్లంగా చూడమ్మా...



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన ఆదివారం కావడంతో దర్శనానికి అనకాపల్లితో పాటు విశాఖ, విజయనగరం జిల్లాల వాసులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలోని చలువ పందిళ్ల నీడలో వంటలు చేసి అమ్మవారికి నివేదించి కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు. గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతలు వారి పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ ఈవో బండారు ప్రసాద్ కల్పించారు. సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీనుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూరింటికి రూ.3.31 లక్షల కరెంటు బిల్లు

సాంకేతిక సమస్యను వెంటనే సరిచేసిన అధికారులు



అధిక బిల్లు వచ్చిందని చూపుతున్న రాజుబాబు

ఎస్.రాయవరం: సాంకేతిక సమస్య వల్ల వచ్చిన విద్యుత్ బిల్లు చూసి ఇంటి యజమాని షాక్‌కు గురయ్యాడు. మండలంలోని గోకులపాడులో పూరింటికి 3 లక్షల 31 వేల 951 రూపాయల విద్యుత్ బిల్లు వినియోగదారుడు రాజబాబు చేతిలో పెట్టి రీడర్ వెళ్లిపోయాడు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న తన ఇంటికి ఇంత పెద్ద మొత్తంలో కరెంటు బిల్లు రావడంతో బాధితుడు లబోదిబోమంటూ ఆ శాఖ అధికారుల వద్దకు పరుగులు తీశాడు. వెంటనే కొరుప్రోలు సబ్ స్టేషన్ ఏఈ గోపి తన సిబ్బందిని పంపారు. ఆదివారం సాయంత్రానికి సరి చేసి వినియోగదారుడు బిల్లు మైనస్‌లో ఉన్నట్టు చెప్పారు. దీంతో అతడు ఊపిరి పీల్చుకున్నాడు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఎలక్ట్రిసిటీ రీడర్‌కు ఏఈ ఆదేశించారు.

అరకులోయలో హైకోర్టు జడ్జి

పర్యాటక ప్రాంతాల సందర్శన



జస్టిస్ దుర్గాప్రసాదరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గార్డెన్ మేనేజర్ బొంజుబాబు

అరకులోయ టౌన్ : ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో ఆదివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు కుటుంబ సమేతంగా పర్యటించారు. ఉదయం విశాఖపట్నం నుంచి కిరండూల్ రైలులో ఇక్కడికి చేరుకున్న ఆయన పద్మాపురం ఉద్యానవనంలో టోయ్‌ట్రైన్‌లో గార్డెన్ అందాలను తిలకించారు. గిరిజన మ్యూజియాన్ని సందర్శించారు. గిరిజనుల జీవనవిధానంపై ఏర్పాటు చేసిన గిరిజన సంప్రదాయ కళాకృతులను తిలకించారు. గిరిజన సంప్రదాయాల గురించి నిర్వాహకుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం ఏపీటీడీసీ పున్నమి రిసార్ట్స్‌కు చేరుకున్నారు. భోజనం అనంతరం అనంతగిరి మండలంలోని బొర్రా గుహలను తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఆయన వెంట జిల్లా న్యాయమూర్తి గిరిధర్, అదనపు జిల్లా న్యాయమూర్తి గోవర్దన్, అరకులోయ ఇన్‌చార్జీ న్యాయమూర్తి ఎమ్.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణ అడ్డగింత



ఆక్రమణలకు గురి అవుతున్న ప్రభుత్వ భూమి ఇదే

ఎస్.రాయవరం: చినఉప్పలం రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి ఆక్రమణను రెవెన్యూ అధికారులు ఆదివారం అడ్డుకున్నారు. ఈ గ్రామంలో కొండ పోరంబోకు, బీచ్‌ను అనుకుని సోషల్ ఫారెస్టు భూములు వేలాది ఎకరాలున్నాయి. ఈ భూములను కొందరు గుట్టు చప్పుడు కాకుండా ఆక్రమించి, సాగు భూములుగా మార్చుకుంటున్నారు. అదేక్రమంలో జగనన్న కాలనీకి దగ్గరలో ప్రభుత్వభూమిలో రెండు రోజులుగా పెద ఉప్పలం గ్రామానికి చెందిన కొందరు చదును చేస్తుండగా అధికారులకు ఫిర్యాదు అందింది.ఈ మేరకు తహసీల్దార్ విజయ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్‌లు రెవెన్యూ సిబ్బందిని ఆస్థలానికి పంపించి పనులు చేయకుండా ఆక్రమణదారులను అడ్డుకున్నారు. ఈ ప్రాంతంలో చాలా మంది ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆక్రమణ దారులను గుర్తించి, తొలగించాలని వారు కోరారు.

కుటుంబ కలహాలతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య



మృతుడు నాగేశ్వరరావు(ఫైల్)

చోడవరం రూరల్: మండలంలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శిరిశెట్టి నాగేశ్వరరావు(40) కుటుంబ కలహాల కారణంగా పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణబాబు వివరాల ప్రకారం.. నాగేశ్వరరావు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఒక పాప, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. కుటుంబపరమైన సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యంలో శనివారం తన ఇంటి మేడపైన పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలోకి చేరిన అతనిని గమనించిన భార్య ఎస్.పూర్ణలక్ష్మి కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో అక్కడి డాక్టర్ సూచన మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని హెచ్‌సీ ఆదివారం తెలిపారు. శవ పంచనామా, పోస్టుమార్టమ్‌ల అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను గ్రామ మాజీ సర్పంచ్ శిరిసోళ్ళ ఆదిగణపతినాయుడు, సర్పంచ్ ఎస్.విజయ కమల గంగాభవాని ఎంపీటీసీలు ఎస్.వీరన్న, షేక్ రెహమాన్, బి.రామారావు పరామర్శించి సంతాపం తెలిపారు.

యువతికి అసభ్యకర మేసేజ్‌లు

- యువకుడు అరెస్ట్



నిందితుడు అవినాష్

పీఎంపాలెం: అసభ్యకర మేసేజ్‌లు, నీలి చిత్రాలను మొబైల్‌కు పంపించి యువతిని వేధిస్తున్న యువకుడు సైబర్ క్రైం పోలీసులకు చిక్కాడు. సైబర్ క్రైం సీఐ కె.భవానీప్రసాద్ తెలిపిన వివరాలివీ.. చెన్నైకి చెందిన అవివాహిత యువతి నగరంలోని ప్రముఖ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. ఇటీవల ఆమె మొబైల్ ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తి అసభ్యకర మేసేజ్‌లు, నీలి చిత్రాలు పంపించాడు. దీంతో షాక్‌కు గురైన ఆ యువతి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పెందుర్తి ప్రసాద్‌నగర్‌కు చెందిన డి.అవినాష్ ఆ యువతికి మేసేజ్‌లు పంపిస్తున్నట్లు గుర్తించారు. అతన్ని ఆదివారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

22 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులతో ఎస్ఈబీ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ చంద్రశేఖర్

దేవరాపల్లి: ఏజెన్సీ నుంచి దేవరాపల్లి మీదుగా తరలిస్తున్న 22 కిలోల గంజాయిని శనివారం రాత్రి దేవరాపల్లి పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం అనకాపల్లి డీఎస్పీ వి. సుబ్బరాజు విలేకరులకు వివరాలు వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం నుంచి గంజాయిని తరలిస్తున్నట్టు స్థానిక ఎస్ఐ డి. నాగేంద్రకు సమాచారం అందింది. దీంతో శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద ఎస్ఐ వాహనాల తనిఖీ చేస్తుండగా ద్విచక్రం వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఎస్ఐ వారిని వెంబడించి ఒక వ్యక్తిని పట్టుకోగా మరో వ్యక్తి పరారయ్యాడు. పట్టుబడిన వ్యక్తి తమిళనాడు రాష్ట్రంలోని కృష్ణగిరి జిల్లా డెంకనికొటెట్ మండలం, కెళమంగళం గ్రామంలోని అన్నా నగర ప్రాంతానికి చెందిన రఘు యెల్లకాయప్పగా పోలీసులు గుర్తించి, అరెస్టు చేశారు. నిందితుడిని విచారించగా తమిళనాడుకు చెందిన నవీన్, వినయ్‌లు పాడేరు చెందిన గంజాయి విక్రయించే తిమోతిని సంప్రదించాలని తనకు సూచించినట్టు తెలిపాడని డీఎస్పీ చెప్పారు. రఘు యెల్లకాయప్పను చోడవరం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఈ నెల 21 వరకు రిమాండ్ విధించినట్టు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు 44 వేలు ఉంటుంది. పట్టుబడిన వ్యక్తి నుంచి 6500 నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. మిగతా నిందితుల కోసం ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎస్. తాతారావు, స్థానిక ఎస్ఐ డి. నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రత్యేక నిఘా

జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయి రవాణాకు అడ్డుకట్టు వేసేందుకు గట్టి నిఘా ఉంచామని డీఎస్పీ వి. సుబ్బరాజు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు కె.కోటపాడు సర్కిల్ పరిధిలో 31 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లో 777 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 81 మంది నిందితులను అరెస్టు చేశామని తెలిపారు.గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన కె.కోటపాడు సీఐ ఎస్. తాతారావు, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు డి.నాగేంద్ర, ఆర్. ధనుంజయ్, బి.రామకృష్ణ, పి.రామారావు, పి.దామోదర్ నాయుడు, క్రైమ్ టీమ్‌లను ఎస్పీ కె.వి. మురళీకృష్ణ అభినందించారని డీఎస్పీ సుబ్బరాజు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు

21 కిలోల గంజాయి స్వాధీనం

నర్సీపట్నం: గంజాయి తరలిస్తున్న ఆరుగురిని నర్సీపట్నం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసరావు అందించిన వివరాలు... మున్సిపాలిటీలోని పీనారపాలెం ఆంజనేయస్వామి ఆలయం మెయిన్ రోడ్డుపై సిబ్బందితో కలిసి ఆదివారం సీఐ ఎస్ఐ చంద్రశేఖర్ రూట్ వాచ్ చేశారు. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై బ్యాగ్‌తో వస్తుండగా అనుమానంతో వాహనం ఆపి తనిఖీ చేయడంతో గంజాయి బయటపడింది. వీరు ఇచ్చిన సమాచారం మేరకు పైలెట్, గంజాయి తీసుకునేందుకు బయపురెడ్డిపాలెం వద్ద వేచి ఉన్న ఇద్దరు వ్యక్తులు, గంజాయి సరఫరా చేసిన మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రోలుగుంట మండలం, రత్నంపేటకు చెందిన పనివాడ శ్రీను(37), పూడి జనార్ధన్ (20), తమటపు సత్యనారాయణ(19), పెద్దాడ జోగింద్రరావు(19), కాకినాడ జిల్లా ఇంద్రపాలెంకు చెందిన మాధవరపు సురేష్‌బాబు(27), ఏఎస్ఆర్ జిల్లా అడ్డతీగలకు చెందిన ముత్తుకాల వీరబాబు(37)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి రూ.42 వేలు విలువ చేసే 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మూడు ద్విచక్రవాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్టు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

బీఎఫ్‌సీ అధ్యక్షుడిగా జోగినాయుడు


బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ నూతన కార్యవర్గం

అనకాపల్లిటౌన్: అనకాపల్లి బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడిగా బీఎస్ఎంకె జోగినాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గవరపాలెం విశాఖ ఫైనాన్షియర్స్ అండ్ బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ భవనంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో క్లబ్ చైర్మన్‌గా పి.ఎస్.అప్పారావు, గౌరవాధ్యక్షునిగా పెంటకోట నర్సింగరావు, కార్యదర్శిగా బుద్ద శివ, కోశాధికారిగా బర్నికాన శ్రీనుతోపాటు మరో 20 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాట్లాడుతూ నూతన కమిటీ మూడేళ్లపాటు మనుగడలో ఉంటుందన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు.

నేడు, రేపు అంగన్‌వాడీ ఉద్యోగుల నిరసన

అనకాపల్లిటౌన్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10,11 తేదీల్లో స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద 36 గంటల నిరసన దీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అంగన్‌వాడీ ఉద్యోగులందరూ నిరసన దీక్షల్లో పాల్గొనాల్సిందిగా కోరారు.

భోజనం ప్యాకెట్ల పంపిణీ


భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న సాయి భక్తులు

ఎస్.రాయవరం: రేవుపోలవరం షిర్డీ సాయిబాబా ఆలయం భక్తులు అందజేసిన విరాళాలతో నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు సాయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అడ్డురోడ్డు నుంచి మొదలుకొని అనకాపల్లి,పాయకరావుపేట వరకు యువకులు వాహనాలపై వెళ్లి అన్న ప్రసాదం అందజేశారు. ఇలా ప్రతీ ఆదివారం వంద నుంచి 3 వందల మందికి అన్న ప్రసాదం అందజేస్తున్నారు.

మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం

రాంబిల్లి : లాలంకోడూరులో గత నెల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కలిగట్ల నాగు కుటుంబసభ్యులకు ఆ గ్రామ యువకులు రూ.1,10,200 ఆర్థిక సాయాన్ని అందజేశారు. నాగుకు భార్య, కుమార్తె ఉన్నారు. వారికి వైఎస్ ఎంపీపీ కళిరెడ్డి నర్సింగరావు, ఐకేఆర్ ఫ్రెండ్స్, లాలం రమణ తదితరుల చేతుల మీదుగా ఆర్థిక సాయాన్ని అందజేశారు.

అనకాపల్లి సినిమాలు

రుద్రంగి	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
ఇద్దరు	: సత్యనారాయణ స్క్రీన్-2
ఈ నగరానికి ఏమైంది? (మార్నింగ్,మ్యాట్నీ)	
రంగబలి	: షిర్డిసాయి
అశ్విన్స్	: పర్తిసాయి
ఇన్సిడియస్ ద రెడ్ డోర్	: వెంకటేశ్వర
భాగ్ సాలే	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 61 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-33 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-17 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 276 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 229 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

చదువులు అప్‌గ్రేడ్

సీఎం జగన్ ప్రభుత్వంలో సర్కారీ స్కూళ్లకు మంచి రోజులొచ్చాయి. ప్రవేశాల సంఖ్య పెరగడంతో ప్రైమరీ స్కూళ్లు కూడా హైస్కూళ్లుగా మారుతున్నాయి. అనకాపల్లి మండలంలో మరో రెండు ప్రైమరీ స్కూళ్లను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేశారు. రూ.2.75 కోట్ల వ్యయంతో అత్యాధునిక వసతులతో కూడిన ఆధునిక భవన నిర్మాణాలు చేపడుతున్నారు.

- హైస్కూళ్లుగా కొండుపాలెం, టీఆర్ కాలనీ ప్రైమరీ స్కూళ్లు
- రూ.2.75 కోట్లతో శరవేగంగా నూతన భవన నిర్మాణాలు


నిర్మాణ దశలో ఉన్న కొండుపాలెం హైస్కూల్ అదనపు తరగతి గదులు


తారకరామారావుకాలనీలో నిర్మాణ దశలో హైస్కూల్ భవనం


తారకరామారావు కాలనీలో ప్రస్తుతం హైస్కూల్ నడుస్తున్న ప్రైమరీ స్కూల్ ప్రాంగణం

అనకాపల్లిటౌన్: సర్కారీ స్కూళ్లు.. శిథిల భవనాలు.. చీకటి గదులు.. అరకొర బోధన. ఇదంతా గతం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సకల సౌకర్యాలతో కూడిన విద్యను పొందాలి. ఆధునిక సాంకేతిక ప్రపంచంతో పోటీ పడాలి. ఇదే ఆలోచనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా విప్లవం తీసుకొచ్చారు. భావితరాల భవితకు బడుల్లోనే బలమైన పునాది పడాలని సంకల్పించారు. ఆ దిశగా నాడు-నేడు పథకంలో స్కూళ్లను అభివృద్ధి చేస్తున్నారు. అందులో భాగంగానే అనకాపల్లి మండలంలో రెండు ప్రాథమిక పాఠశాలలను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేశారు. వాటికి ప్రత్యేకంగా భవనాలు నిర్మిస్తున్నారు.

కొండుపాలెం, టీఆర్ కాలనీ స్కూళ్లకు మహర్దశ

మండలంలోని కొండుపాలెం, తారకరామారావు(టీఆర్)కాలనీల్లోని ప్రాథమిక(ప్రైమరీ) పాఠశాలలను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం పాత స్కూళ్లలోనే తరగతులు కొనసాగుతున్నాయి. ఒక్కో హైస్కూల్‌కు సుమారు 5 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. భావితరాలను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక వసతులతో కూడిన భవనాలను నిర్మించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కొండుపాలెం హైస్కూల్‌కు రూ.కోటీ 60 లక్షలతో కొత్తగా తొమ్మిది విశాలమైన తరగతి గదులు నిర్మిస్తున్నారు. తారకరామారావు కాలనీ హైస్కూల్‌కు రూ.కోటీ 15 లక్షలతో 7 తరగతి గదుల్ని ఏర్పాటు చేస్తున్నారు. వీటి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొండుపాలెం హైస్కూల్ భవనాన్ని ఈ ఏడాది అక్టోబర్ నాటికి అందుబాటులోకి తీసుకురానున్నట్టు అధికారులు చెప్తున్నారు. తారకరామారావుకాలనీ స్కూల్ భవన నిర్మాణాన్ని మాత్రం ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసి, విద్యార్థుల వినియోగానికి వీలుగా తీర్చిదిద్దనున్నారు.

క్రీడామైదానాలు.. డిజిటల్ తరగతి గదులు

పాఠశాల విద్యలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొస్తోంది. కార్పొరేట్ స్థాయికి దీటుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూరుస్తోంది. ఇందులో భాగంగా డిజిటల్ తరగతి గదుల్ని ఏర్పాటు చేస్తున్నారు. వర్చువల్ తరగతి గదుల్ని దాతల సాయంతో ఏసీ గదులుగా మార్చేందుకు కూడా ఆలోచిస్తున్నారు. విద్యతోపాటు ఆటపాటల్లో కూడా విద్యార్థులు రాణించాలనే లక్ష్యంతో రెండు స్కూళ్ల ఆవరణలో విశాలమైన ఆటస్థలం, ప్రత్యేక క్రీడా కోర్టులు, స్కూల్ చుట్టూ రక్షణగా ప్రహరీ, ఆహ్లాదకర వాతావరణానికి వీలుగా ప్రహరీ చుట్టూ మొక్కల్ని నాటేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

హైస్కూళ్ల ఏర్పాటు అభినందనీయం



కొండుపాలెం గ్రామంలో ప్రైమరీ స్కూల్ వరకూ మాత్రమే ఉండేది. ఆరో తరగతి నుంచి రేబాక హైస్కూల్‌కు విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగించేవారు. మా గ్రామం నుంచి రేబాకకు 5 కిలో మీటర్ల దూరం. విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదాలు జరిగేవి. హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో పదో తరగతి వరకూ ఇక్కడే చదువుకునేందుకు అవకాశం ఏర్పడింది. ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం.

– బొండా ఉమ, స్కూల్ కమిటీ చైర్మన్, కొండుపాలెం

త్వరితగతిన పనులు పూర్తి



నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలికసదుపాయలు మెరుగుపడ్డాయి. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన డిజిటల్ తరగతి గదులను ఏర్పాటు చేస్తున్నాం. ప్రాథమికోన్నత పాఠశాలల్ని అవసరమైన మేరకు హైస్కూళ్లుగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తోంది. ఈ ఏడాదిలోపు కొండుపాలెం, తారకరామారావు కాలనీ హైస్కూళ్లలో నూతన భవన నిర్మాణాలు పూర్తి చేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– కోటేశ్వరరావు, ఎంఈవో-2, అనకాపల్లి

గ్రూప్ 4 నియామకాలపై మంత్రికి వినతి


మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసిన గ్రూప్-4 ప్రాథమిక ఎంపిక జాబితా అభ్యర్థులు

తుమ్మపాల: ఏపీపీఎస్సీ గ్రూప్-4 ప్రాథమిక ఎంపిక జాబితాపై తుది నియామక ప్రకటనను త్వరగా విడుదల చేయాలని కోరుతూ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ప్రాథమిక ఎంపిక జాబితా అభ్యర్థులు ఆదివారం మిందిలోని ఆయన నివాసంలో కలిసి, వినతి పత్రం అందించారు. మంత్రి స్పందించి ప్రభుత్వానికి తమ వినతిని చేరవేసి, త్వరగా నియామక ప్రకటన వచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు అభ్యర్థులు ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రిని కలిసినవారిలో నామాల సత్యనారాయణ, దాడి నారాయణరావు, పొన్నగంటి శ్రీనివాసరావు తదితరులున్నారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

కోటవురట్ల: మండలంలోని కె.వెంకటాపురం, రామచంద్రపాలెం గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలు అందజేయనున్నట్టు చెప్పారు. కె.వెంకటాపురంలో తహసీల్దారు బృందం, రామచంద్రపాలెంలో ఎంపీడీవో బృందం కార్యక్రమాన్ని నిర్వహిస్తాయని తెలిపారు.

'గ్రామీణ యువజన మందిరం' సేవలు అభినందనీయం


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ

మునగపాక: స్థానిక గ్రామీణ యువజన మందిరం సంస్థ సేవలు అభినందనీయమని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ అన్నారు. ఆడారి పోలయ్య కమతాల వద్ద ఆదివారం ఈ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ సంస్థ ద్వారా కళారంగం అభివృద్ధితో పాటు విద్యార్థులకు అవసరమయ్యే సౌకర్యాలు అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. మందిర అధ్యక్షులు ఆడారి గంగమహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షులు సూరిశెట్టి రాము,పెంటకోట సీతారామ్, కార్యదర్శి పీలా వెంకటప్పారావు, ఉపాధ్యక్షులు మళ్ల కృష్ణ, కోశాధికారి దాడి సీతారామ్, స్పోర్ట్స్ డైరెక్టర్ పెంటకోట విజయ్, కార్యవర్గ సభ్యులు దాడి సాంబమూర్తి, అంజలినాయుడు,దాడి అప్పలనాయుడు,ఆడారి సూరిబాబు, ఆడారి గోవింద తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువజన మందిరం అధ్యక్షునిగా గంగమహేష్

స్థానిక గ్రామీణ యువజన మందిరం సంస్థ అధ్యక్షునిగా ఆడారి గంగమహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మునగపాకలో ఆదివారం యువజన మందిరం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఆడారి సోమశేఖర్, కోశాధికారిగా దాడి సాంబశివ, ఉపాధ్యక్షునిగా దాడి అప్పలనాయుడు, సహాయ కార్యదర్శిగా దాడి అరుణ్‌కుమార్, క్రీడా డైరెక్టర్‌గా పెంటకోట విజయ్, సభ్యులుగా పెంటకోట శివగణేష్, షేక్ నాగూర్, దాడి జగన్నాథరావు, వేగి సాయిబునాయుడు, కాండ్రేగుల చైతన్య, పీలా వెంకటప్పారావు, మళ్ల కృష్ణ నియమితులయ్యారు. మందిర గౌరవ అధ్యక్షులు సూరిశెట్టి రాము, పెంటకోట సీతారామ్‌ల సమక్షంలో కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.

బొడ్డేడ ప్రసాద్‌కు సత్కారం


వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌కు జ్ఞాపిక అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మునగపాక: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌ను ఆదివారం మునగపాక స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. మునగపాకకు చెందిన గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్‌కు పార్టీ అధ్యక్ష పదవి అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం బొడ్డేడ క్యాంప్ కార్యాలయంలో సంస్థ ప్రతినిధులు శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అలంక సూర్యప్రకాశరావు, సూరిశెట్టి రాము, దాడి సూరిబాబు, అనకాపల్లి సూరిబాబు, సూరిశెట్టి కన్నారావు, మోహనరావు, ఆడారి అప్పలనాయుడు, దాడి అప్పలనాయుడు, దాడి శ్రీరామమూర్తి, జేవీజే కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గౌతమ పఠన మందిరానికి మైక్‌సెట్ వితరణ


మైక్ సెట్ అందజేస్తున్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ రామ్మోహనరావు

మునగపాక: స్థానిక సంతబయిల గౌతమ పఠన మందిరానికి పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు ద్వారా ఆదివారం మైక్‌సెట్‌ను దాతలు అందజేశారు. ఈ సందర్భంగా గౌతమ పఠన మందిరం అధ్యక్షుడు దాడి సూరిబాబు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో పఠన మందిరాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, మందిర కార్యదర్శి వెలగా శ్రీనివాసరావు, సంఘ సభ్యులు దాడి శ్రీరామమూర్తి, కుంది సూర్యనారాయణ, నెహ్రూ, బూడిద రామారావు, లక్ష్మణరావు, పెద్దలు సూరిశెట్టి కన్నారావు, ఆడారి కృష్ణ దాడి శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లలితాంబ పండగ


లలితాంబ అమ్మవారు

రాంబిల్లి: దిమిలి గ్రామంలో ఆదివారం లలితాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. దిమిలి పరిసర గ్రామాల భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

410 మందికి కంటి వైద్య పరీక్షలు


కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న దొరైస్వామి

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్ కంపెనీ ద్వారా పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా కంటి వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి తెలిపారు. ఆదివారం బ్రాండిక్స్ అపెరల్ పార్కు సిటీలో నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కంటి శిబిరంలో 410 మందికి పరీక్షలు నిర్వహించారు. 287 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు.87 మందికి మందులు అందజేశారు. శస్త్ర చికిత్సలు చేయించుకోవాలని 52 మందికి వైద్యులు సూచించారు.శిబిరానికి వచ్చిన రోగులకు మధ్యాహ్నం భోజనం,ఫలహారం, మజ్జిగ అందజేశారు. విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన శిబిరంలో వైద్యులు, బ్రాండిక్స్ సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

మునగపాక అభివృద్ధికి సహకరించాలి


పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: మండల కేంద్రమైన మునగపాక అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక సంతబయిల కూరగాయలు,చేపల మార్కెట్ అభివృద్ధికి లారస్ కంపెనీ ఆర్థిక సహకారం అందజేసింది. ఆ నిధులతో జరుగుతున్న అభివృద్ధిపనులను ఆయన స్థానికులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పనులు జరిగేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశిబాబు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు రక్తపరీక్షలు


వసతిగృహ విద్యార్థులకు రక్తపరీక్షలు చేయిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు పౌష్టికాహారంలో భాగంగా వారానికి మూడు రోజులు చికెన్, ప్రతి రోజు గుడ్డు అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. తన జన్మదిన వేడుకల్లో భాగంగా స్థానిక గాంధీనగరం బీసీ వసతి గృహం విద్యార్థులకు అబ్దుల్ కలాం సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్, హరిశెట్టి క్లినికల్ ల్యాబ్ కుమారస్వామి సహకారంతో ఆదివారం ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం చాలా పురాతనమైనదని, చాలా భాగం శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. విద్యార్థులు భయభ్రాంతులకు లోను కాకుండా తన సొంత నిధులతో తక్షణమే తాత్కాలి మరమ్మతులు చేసి, ఉన్నతాధికారులతో చర్చించి నూతన వసతిగృహానికి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెండు వసతి గదులను తానే సొంత నిధులతో కట్టిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పథకం కింద అన్ని రకాల సౌకర్యాలను కల్పించడంతోపాటు జగనన్న విద్యా కానుకలో విద్యార్థులకు స్కూల్ యూనిఫారం, పుస్తకాలు, బ్యాగు, బూట్లు తదితర సామగ్రి అందించినట్టు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలషించారు. ఉన్నత విద్యకయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి అమ్ములు శ్రీను, కార్యదర్శి కొణతాల రాజు, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్నియాదవ్, సభ్యులు దినేష్, చిరంజీవి, సతీష్, బీసీ వెల్ఫేర్ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది


సమావేశంలో మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు

అనకాపల్లి రూరల్ : ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవన విధానంలో ఆరోగ్యంపై నిర్లక్ష్యం చూపరాదని ప్రజారోగ్య వేదిక ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరావు అన్నారు. ఆదివారం అనకాపల్లి దొడ్డి రామానాయుడు భవన్‌లో నిర్వహించిన 41వ ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం ప్రతి నెల ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రెండు నెలలకోసారి బీపీ, సుగర్, పక్షవాతం, ఫిట్స్ తదితర రోగాలకు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. తమ వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలకు సేవలందించేందుకు పలువురు వైద్యులు, సిబ్బంది వైద్య శిబిరాలకు ప్రోత్సాహాన్నిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. శిబిరంలో భాగంగా డాక్టర్లు సాంబమూర్తి, బి.మీనేంద్రకుమార్, కె.దివాకరరావు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మళ్ల చంద్రశేఖర్, కొల్లూరు శ్రీరామమూర్తి, కొణతాల త్రినాథ్, బి.నూకఅప్పారావు, ఎస్.రాజు, వీవీ శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు

విత్తన శుద్ధితో అధిక దిగుబడి


ఆనందపురంలో మహిళలకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

కశింకోట: విత్తన శుద్ధితో పంట దిగుబడి పెరుగుతుందని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ అన్నారు. మండలంలోని సుందరయ్యపేట శివారు ఆనందపురం, లాలంకొత్తూరు, నూతలగుంటపాలెం గ్రామాల్లో ఖరీఫ్ వరి విత్తనాల శుద్ధి, బీజామృతం తయారీపై రైతులకు ఆదివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన సేవల్ని గ్రామ స్థాయిలోనే అందించేందుకు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఆర్బీకే సేవల్ని రైతులు వినియోగించుకోవాలన్నారు. విత్తనశుద్ధి చేసి నీడలో ఆరబెట్టి తర్వాత విత్తుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి డి.రమణ, సిబ్బంది దేవి తదితరులు పాల్గొన్నారు.

మరింత విస్తృతంగా వాకర్స్ క్లబ్ సేవలు


వాకర్స్‌క్లబ్ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

తుమ్మపాల: పట్టణంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వివేకానంద ఫంక్షన్ హాల్లో 3వ కెబినెట్ మీటింగ్ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వాకర్స్ 101 క్లబ్ గవర్నర్ ఉప్పలపాటి శుభ, ఏహెచ్ఎన్ వెంకటరావు, డాక్టర్ డీడీ నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని వాకర్స్ క్లబ్ సేవల్ని వివరించారు. రానున్న కాలంలో తమ సేవల్ని మరింత విస్తృతం చేయనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో కల్యాణి అకాడమీ చిన్నారుల భరతనాట్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. అంతకుముందు గణేష్ ప్రార్థన, స్వాగత ఉపన్యాసం ప్రతిజ్ఞా కార్యక్రమాలను రాపేటి నారాయణరావు, యల్లపు సత్యనారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీరెడ్డి, ఆర్‌సీ-5 డాక్టర్ విష్ణుమూర్తి, అధిక సంఖ్యలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సామాజిక భవనానికి కృషి


ఎంపీ సత్యవతిని కలిసిన ముదిరాజ్ సామాజిక సభ్యులు

అనకాపల్లిటౌన్: అనకాపల్లిలో ముదిరాజ్ సామాజిక భవన నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక ఎంపీ కార్యాలయంలో ఎంపీ సత్యవతిని ఆదివారం ముదిరాజ్ సామాజిక సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ముదిరాజ్‌లకు సామాజిక భవనం ఉందని, కొత్తగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో మాత్రం ఇంకా నిర్మాణం కాలేదన్నారు. నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఎంపీని కలిసినవారిలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడాల సత్యనారాయణ, ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు కనిశెళ్ల బాబాజీ ముదిరాజ్, గుత్తికొండ గణేశ్వరరావు, నాగేశ్వరరావులున్నారు.